బీజేపీలో చెల్లని వ్యక్తి కాంగ్రెస్‌లో చెల్లుతాడా?

రావుల శ్రీధర్ రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రావుల శ్రీధర్ రెడ్డి

కంటోన్మెంట్: బీజేపీలో చెల్లని వ్యక్తి కాంగ్రెస్‌లో చెల్లుతాడా రేవంత్ రెడ్డి? అని బీఆర్ఎస్ కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రావుల శ్రీధర్ రెడ్డి ప్రశ్నించారు. కంటోన్మెంట్‌లో ఓటమి భయంతోనే సీఎం రేవంత్ రెడ్డి వారంలోనే రెండుసార్లు ప్రచారానికి వచ్చారని అన్నారు. మంగళవారం బోయిన్‌పల్లిలో ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి, కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి నివేదితతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం అంటూ సీఎం అనడం ఎంత వరకు సబబు అన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉంటే కంటోన్మెంట్‌ను అభివృద్ధి చేయరా? అంటూ ప్రశ్నించారు. రెండుసార్లు బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమిపాలైన శ్రీగణేశ్, కాంగ్రెస్‌లో ఎలా గెలుస్తాడని ప్రశ్నించారు. కంటోన్మెంట్ విలీనం కోసం 1997లోనే సాయన్న ప్రతిపాదన పెట్టారని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, శ్యాంకుమార్, లోక్ నాథ్, మాజీ కార్పొరేటర్ ఆకుల రూప హరి, సీనియర్ నాయకులు టీఎన్ శ్రీనివాస్, ఆకుల హరి పాల్గొన్నారు.

‘ఫేక్ వీడియోల వెనుక రేవంత్ రెడ్డి హస్తం’



సమావేశంలో మాట్లాడుతున్న తేజస్వీ సూర్య

కంటోన్మెంట్: ఫేక్ వీడియోలతో బీజేపీని అభాసుపాలు చేయాలని చూసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని బీజేవైఎం జాతీయ అధ్యక్షుడు ఎంపీ తేజస్వి సూర్య అన్నారు. ఈ ఫేక్ వీడియోల వెనుక సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆరోపించారు. మహేంద్రహిల్స్ లో బీజేవైఎం అధికార ప్రతినిధి మల్క యశస్వి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మేధావుల సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలపై అఘాయిత్యాలను ఎన్డీయే ఎప్పుడు సహించదన్నారు. శాంతి భద్రతల విషయంలో కర్ణాటక ప్రభుత్వానిదే పూర్తి బాధ్యత అన్నారు. ఎన్డీయే మూడోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారంటూ కాంగ్రెస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బీజేపీ 15 పార్లమెంట్ స్థానాలను కైవసం చేసుకోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత మల్క కొమరయ్య, బీజేవైఎం జాతీయ కోశాధికారి సాయి ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి సురేష్, పవన్ రెడ్డి పాల్గొన్నారు.

తార్నాకలో ‘దానం’కు మద్దతుగా ప్రచారం



మాణికేశ్వర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లాలాపేట: పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీగా దానం నాగేందర్‌ను గెలిపించాలని మంగళవారం జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి ఆధ్వర్యంలో లాలాపేట ప్రాంతంలో ప్రచారం నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలనను ప్రజలకు వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. మాజీ వార్డు మెంబర్ వి. లాజరస్ ఆధ్వర్యంలో మాణికేశ్వర్‌లో ఇంటింటికీ ప్రచారం చేశారు. ప్రజలకు కలిసి కాంగ్రెస్ పాంచ్ న్యాయ్‌ల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా పాలన కోసం హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో వేముల శ్రీనివాస్, ఆలకుంట లింగయ్య, రవి, తులసీ రామ్, వెంకటేష్ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు అందిస్తున్న ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్: రైలు ప్రయాణాల్లో చోరీకి గురైన 166 సెల్ ఫోన్లను మంగళవారం సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు స్వాధీనం చేసుకుని ప్రయాణికులకు అందించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సాయీశ్వర్‌గౌడ్ కథనం ప్రకారం.. సీఈఐఆర్ యాప్ ద్వారా నమోదైన సెల్‌ఫోన్ చోరీ కేసులను దర్యాప్తు చేసిన రైల్వే పోలీసులు తెలుగు రాష్ట్రాలతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రయాణికులు పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను అందించామన్నారు.

సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: ఉద్యోగ ఉపాధి అవకాశాలు గల సైబర్ సెక్యూరిటీ కోర్సుల్లో శిక్షణకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు నేషనల్ అకాడమీ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ సంస్థ డైరెక్టర్ డాక్టర్ విమలా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల్లో చేరడానికి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిప్లొమా అభ్యర్థులు అర్హులని ఆసక్తిగల వారు ఈ నెల 15వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 7893141797 లేదా www.nacsindia.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

రేపు యాదవ సమ్మేళనం

కాచిగూడ: యాదవ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన అంబర్‌పేట, బతుకమ్మ కుంట గ్రౌండ్స్‌లో యాదవ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు బీజేపీ ఓబీసీ మోర్చా హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్, సంఘం అధ్యక్షుడు సి.నందకిషోర్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు కాచిగూడ చెప్పల్‌బజార్‌లో యాదవ సంఘం సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు.

జీహెచ్ఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌లు

హిమాయత్‌నగర్: జీహెచ్ఎంసీలో అమలు చేస్తున్న పథకాలను అధ్యయనం చేసేందుకు వచ్చిన ట్రైనీ ఐఏఎస్‌లకు వాటి అమలుపై కమిషనర్ రోనాల్డ్ రాస్ వివరించారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూం హాల్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. డెమోగ్రఫీ, శానిటేషన్, చెత్త సేకరణ, డిస్పోజల్, సీఅండ్‌డీ అడ్మినిస్ట్రేషన్, ప్రాపర్టీ ట్యాక్స్ తదితర పథకాలను కమిషనర్ వివరించారు. 5 రోజులపాటు అధ్యయనానికి వచ్చిన నేపథ్యంలో పథకాలను పరిశీలించేందుకు సంబంధిత హెచ్‌ఓడీలు సహకరించాలని సూచించారు. ఈఎన్‌సీ జియాఉద్దీన్, ఉపేందర్ రెడ్డి, గీత రాధిక, సునంద, ట్రైనీ ఐఏఎస్‌లు ఉమా శంకర్, అమిత్, కిరణ్మయి, శారద శుక్ల,యువరాజ్, మాయక్, వికాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు మందకృష్ణ మోసం

దళిత సంఘాల నేతల ఆరోపణ

హిమాయత్‌నగర్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ జాతిని మోసం చేస్తూ, ఇప్పుడు తన స్వార్థం కోసం మతతత్వ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పలువురు దళిత సంఘాల నాయకులు ఆరోపించారు. మంద కృష్ణ చెపితే మాదిగలు వినే పరిస్థితి లేదని, అవసరమైతే ఆయన్ని మాదిగజాతి నుంచి బహిష్కరిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్.ఆర్.మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరెవల్లి రాజేందర్, ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ గత పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వర్గీకరణను ఎందుకు చేయలేదో కృష్ణమాదిగ సమాధానం చెప్పాలన్నారు. కేంద్రంలో సెక్యులర్ ప్రభుత్వాన్ని ఏర్పాటు కావాల్సిన అవసరం ఉందని, అందుకే మాదిగ జాతి ఇండియా కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

కౌన్ బనేగా.. సికింద్రాబాద్‌షా

జోరందుకున్న బూత్ కమిటీ సభ్యుల ఇంటింటి ప్రచారం

- లష్కర్‌లో వేడెక్కిన రాజకీయం
- అంతర్గత ప్రచారాలకు శ్రీకారం
- ప్రతినిధులకు నగదు, నజరానాలు



సికింద్రాబాద్: పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో లష్కర్‌లో రాజకీయ సందడి ఊపందుకుంది. ఒకవైపు ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులు ఏర్పాట్లు విస్తృతం చేస్తుండగా, ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు అంతర్గత ప్రచారాలకు సమాయత్తం అవుతున్నారు. రాజకీయ పార్టీల నాయకులు బూత్ కమిటీల ప్రతినిధులను నియమించుకుని తమకు అనుకూలంగా ఓటింగ్ చేయించుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి. సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని మూడు ప్రధాన రాజకీయ పార్టీలు బూత్‌కమిటీల ద్వారా తమ బూత్‌లెవల్ కార్యాచరణలు అమలులోకి తెచ్చాయి. బూత్ కమిటీ ప్రతినిధుల ద్వారా ఓటర్లను ప్రసన్నం చేసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రెండ్రోజులుగా డివిజన్ల వారీగా ఆయా డివిజన్ల నాయకులు ఎన్నికల ప్రచారాలు ముమ్మరం చేసుకుంటున్నారు. పలువురు కార్యకర్తలు, నాయకులు ర్యాలీగా వెళ్లి పోల్‌చీటీలు అందించడం, నమూనా ఓటింగ్ మెషిన్‌లను చూపిస్తూ అభ్యర్థుల గుర్తులను ఓటర్లకు వివరిస్తున్నారు.

నగదు, నజరానాల అందజేత

బూత్‌ల వారీగా ఇక్కడి మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు కమిటీలను ఏర్పాటు చేసుకున్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 220 పోలింగ్ బూత్‌లు ఉండగా ఒక్కో బూత్‌కు 15 నుంచి 30 వరకు వీలున్నంత మంది సభ్యులతో కమిటీలు ఏర్పాటు చేసుకున్నారు. కమిటీ ప్రతినిధుల ద్వారా అంతర్గత ప్రచారాలకు అభ్యర్థులు శ్రీకారం చుట్టారు. ఇంటింటికీ వెళ్తూ బూత్‌కమిటీ సభ్యులు ఓటర్లను నేరుగా కలుస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అదే పనిలో ఉంటున్నారు. బూత్ కమిటీ సభ్యులకు రాజకీయ పార్టీల అభ్యర్థులు నగదు నజరానాలు అందిస్తున్నందున కమిటీలో చేరేందుకు ఆయా ప్రాంతాల యువకులు తీవ్రంగా పోటీ పడుతున్నారు.

విస్తృతంగా సమావేశాలు..

నియోజకవర్గంలో రాజకీయాలకు అతీతంగా యువకులు, మహిళలు, కుల సంఘాలతో ఇబ్బడి ముబ్బడిగా సమావేశాలు అన్ని పార్టీల ఎన్నికల కార్యాలయాల్లో జరుగుతున్నాయి. సికింద్రాబాద్ నియోజకవర్గంలో ఐదు మున్సిపల్ డివిజన్లు ఉన్నాయి. కొందరు అభ్యర్థులైతే పురుషులు, మహిళలకు వేర్వేరుగా బూత్ కమిటీలు నియమించి వారి ఖర్చులను భరిస్తున్నారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసుకున్న ఎన్నికల కార్యాలయాల్లో ఆయా సంఘాల సభ్యులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఓటరు జాబితా ఆధారంగా వారి ఓటర్ల నివాసాల్లోకి వెళ్లడం, పోల్‌చీటీలు అందించడం, గుర్తులు తెలియజెప్పడం...తమ పార్టీకి ఓటు వేయించుకునే విధంగా నచ్చజెప్పడం బూత్ కమిటీ సభ్యుల విధులు. బూత్ కమిటీ సభ్యులకు ఉదయం టిఫిన్, మధ్యాన్నం భోజనం అందించడంతోపాటు రోజువారీ ఖర్చులకోసం డబ్బు అందించే కేంద్రాలుగా ఎన్నికల కార్యాలయాలు పనిచేస్తున్నాయి.

నందడే నందడి..

ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రాజకీయ సందడి కనిపిస్తుంది. ప్రధాన రహదారుల్లోని ఆయా రాజకీయా పార్టీల ఎన్నికల కార్యాలయాల ముందు వందలాది మంది కార్యకర్తలు బారులు తీరుతున్నారు. ఇరుకైన రహదారుల్లోని ఎన్నికల కార్యాలయాల ముందు వివిధ పార్టీల జెండాలతో కూడిన వాహనాలు, గుంపులు గుంపులుగా ఉంటున్న కార్యకర్తలతో రాజకీయ సందడి నెలకొంది. ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు అన్ని ఎన్నికల కార్యాలయాలను సందర్శిస్తూ అంతర్గత ప్రచార సరళిని సమీక్షిస్తున్నారు.

ఐఎస్‌సీ, ఐసీఎస్ఈ బోర్డు ఫలితాల్లో సత్తా



శ్రీహిత నీలి   కశ్యప్ తివారీ   ఆదిత్య

సనత్‌నగర్: ఐఎస్‌సీ, ఐసీఎస్ఈ బోర్డు ఫలితాల్లో బేగంపేట గీతాంజలి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఐఎస్‌సీ హ్యుమానిటీస్ విభాగంలో పాఠశాల విద్యార్థిని శ్రీహిత నీలి (390/400) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా సైన్స్ విభాగంలో కశ్యప్ తివారీ (388/400) సాధించగా కామర్స్ విభాగంలో త్రిష ముకేష్ చందన 93.25 శాతంతో ప్రథమ స్థానాలను కై వసం చేసుకున్నారు. అలాగే ఐసీఎస్ఈ బోర్డు ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఆదిత్య పటావ్రీ (585/600) మార్కులను సాధించగా, ఆ తర్వాత స్థానాల్లో 97 శాతం మార్కులతో ఎన్.సహస్ర, రితిక కొటారి నిలిచారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కన్స్యూమర్ రైట్స్‌పై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్ గౌడ్

లాలాపేట: మార్కెట్‌లో ఏదైనా వస్తువును కొనుగోలు చేసేటప్పుడు వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని నేషనల్ కన్స్యూమర్ రైట్ కమిషన్ స్టేట్ చైర్మన్ వల్దాస్ చంద్రశేఖర్ గౌడ్ సూచిస్తున్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మార్కెట్లో అనేక రకాల అవకతవకలు జరుగుతున్నాయన్నారు. త్వరలో వాటిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో కుమ్మరి శ్రీకాంత్, వినోద్‌కుమార్,వినయ్ తదితరులున్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తీరిన విద్యుత్ సమస్య



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అధికారులు, స్థానికులు

సనత్‌నగర్: అధిక విద్యుత్ వినియోగంతో భారంగా మారిన డీఎస్ఎం కాలనీ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో అధికారులు కొత్తది ఏర్పాటు చేశారు. మూడు రోజుల క్రితం కాలనీలో ఏసీలు, రిఫ్రిజిరేటర్లు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులతో ధ్వంసమయ్యాయి. దీంతో కాలనీవాసులు అదనపు సామర్థ్యంతో కూడిన కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను కోరగా మంగళవారం 315 కేవీఏ స్థానంలో 500 కేవీఏ సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సమకూర్చారు. సనత్‌నగర్ ఏఈ శేఖర్ తన సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ పనితీరును పరిశీలించారు.

టీఎస్‌సెట్‌ను వాయిదా వేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్–2024ను వాయిదా వేయాలని సభ్య కార్యదర్శి ప్రొ.నరేష్ రెడ్డికి తెలంగాణ స్టూడెంట్స్ పరిషత్ (టీఎస్‌యూ) నాయకులు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. వివిధ ఉద్యోగ రాత పరీక్షలతో పాటు ఇతర పోటీ పరీక్షలు ఉన్నందున ఆగస్టులో జరిగే టీఎస్‌సెట్‌ను వాయిదా వేయాలని టీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి వడ్డెపల్లి సందీప్ డిమాండ్ చేశారు.

సన్మానం



శ్వేతహస్సెన్‌ను సన్మానిస్తున్న కాలేజీ సిబ్బంది

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని అభ్యాస మహిళ డిగ్రీ కాలేజీలో జరిగిన ఫేర్‌వెల్ పార్టీ 2024 కార్యక్రమంలో ఓయూ జేఏసీ కన్వీనర్, డా.బీఆర్ అంబేడ్కర్ ఏక్తా మంచ్ రాష్ట్ర అధ్యక్షురాలు తల్లమల్ల శ్వేత హస్సెన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలేజీని వీడిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వృత్తి విద్య కోర్సులను ప్రవేశపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త అవంచ.ప్రశాంత్, కాలేజీ డైరెక్టర్లు మల్లేష్‌గౌడ్, మహేందర్, సునీత పాల్గొన్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.21, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 37, దొండ 28, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 55, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 15, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 32, చామగడ్డ 38, మొరంగడ్డ 28.

డప్పుకొడుతూ.. ఓటు అడుగుతూ..

సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని మంగళవారం బౌద్ధనగర్ డివిజన్‌లోని పార్శిగుట్ట నుంచి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ అనుబంధ సంఘాలు డప్పు కొడుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాదిగలకు అండగా నిలబడ్డ ప్రధాని మోదీ, కిషన్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. –బౌద్ధనగర్



కార్నర్.. అవ్వాలి విన్నర్



చిలకలగూడ డివిజన్ కిందిబస్తీలో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా మంగళవారం నిర్వహించిన కార్నర్‌మీటింగ్‌లో మాజీ మేయర్ బండా కార్తీకారెడ్డి పాల్గొని మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గెలుపుకోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. –సికింద్రాబాద్

కార్పొరేటర్.. ఇంటింటి ప్రచారం

సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరుతూ మంగళవారం బేగంపేట భగవంతాపూర్‌లో కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారు గుర్తుపై ఓటేయాలని కోరారు. సనత్‌నగర్‌లో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. –సనత్‌నగర్



అభివృద్ధి చేశాం.. ఓటేయాలని అడుగుతున్నాం



మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బేగంపేట డివిజన్ ప్రాంతాల్లో కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరితో కలిసి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని బీఆర్ఎస్ హయాంలో చేసి చూపించామని, అభివృద్ధిని చూసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలన్నారు. –సనత్‌నగర్